
విజేతలతో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు

చీమకుర్తి: రాష్ట్రస్థాయి 42వ సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పోటీలను ప్రారంభించడంతో పాటు విజేతలకు బహుమతులు అందించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్‌ఎం పార్వతిశాంతి, పీడీల అసోసియేషన్ సభ్యులు, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొత్త ఆశలకు స్వాగతం

ఒంగోలు నగరంలో నూతన సంవత్సర సందడి నెలకొంది. కొత్త ఆశలకు స్వాగతం పలికేందుకు నగరవాసులు సిద్ధమయ్యారు.


ఒంగోలులో కేక్‌లు కొనుగోలు చేస్తున్న నగరవాసులు


అద్దంకి బస్టాండ్ పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ


లాయర్‌పేట సాయి సన్నిధిలో ప్రత్యేక అలంకరణ


ఒంగోలు నగరంలో యువతుల సందడి


విద్యుత్ దీపాలంకరణలో కొండమీద శివాలయం



## రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష


మెడికల్ కిట్లను పరిశీలిస్తున్న జేడీ, డీఎంహెచ్‌ఓ

మద్దిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మండలంలోని మల్లవరం గ్రామంలో మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. రాష్ట్ర సెకండరీ హెల్త్ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ పీ సరళమ్మతో కలిసి ఆదివారం మద్దిపాడు పీహెచ్‌సీకి వెళ్లిన డీఎంహెచ్‌ఓ.. అక్కడున్న మందులు, మెడికల్ టెస్టులకు సంబంధించిన కిట్లు, కేస్ షీట్లు, ఫోల్డర్‌లు అన్నీ అందాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. జనవరి 2వ తేదీ నుంచి ప్రతి నెలా నాలుగు రోజులపాటు మండలంలోని అన్ని సచివాలయాల్లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ క్యాంపును ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రజలు విరివిగా క్యాంపులను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కేఎస్ఎన్ మూర్తి, ఆస్పత్రి డాక్టర్లు ఆనందమోహన్, శ్రావణ్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన లారీ


కిమ్స్‌లో చికిత్స పొందుతున్న అమర్నాథ్

ఒంగోలు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఒంగోలులోని కల్వరి టెంపుల్‌కు ఒక ఆటోలో బయలుదేరారు. త్రోవగుంట సమీపంలోని మహాలక్ష్మి కోల్డ్ స్టోరేజ్ వద్దకు రాగానే గుర్తు తెలియని లారీ వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ఆటోలో ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఈదుమూడి గ్రామానికి చెందిన కొమ్మూరి అమర్నాథ్(12), కొమ్మూరి కుమారి, ఆటో డ్రైవర్ ముంగర సామేలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అమర్నాథ్ తలకు తీవ్రమైన గాయాలు కావడంతో వైద్యులు తక్షణమే శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు సమాచారం. మిగిలిన వారు కూడా ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారు. అలాగే ముంగర శ్యామల, ఇనగంటి కల్పనలకు కూడా గాయాలు కాగా వారికి వెంకట రమణ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయింది. తాలుకా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. మంచు కురుస్తుండటంతో రోడ్డు పక్కన ఆటో ఆపి అద్దాలు తుడుచుకుంటుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టి వెళ్లిపోయినట్లు తెలిసింది.







## దివ్యాంగులకు సరుకుల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తిలోని బధిరుల పాఠశాలకు చెందిన దివ్యాంగులకు ఎస్సై రామిరెడ్డి చేతుల మీదుగా ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. దాంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చీమకుర్తి మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామతీర్థంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి నెలా దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసరాల ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఎస్సై రామిరెడ్డి మాట్లాడుతూ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ, డాక్టర్ బీ జవహర్, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ మేదరమెట్ల శ్రీనివాసులు, స్థానిక నాయకులు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, లగడపాటి శ్రీనివాసరావు, సూరంపల్లి హనుమంతరావు, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్, లారీ ఓనర్స్ పాల్గొన్నారు.

## ఏకేయూ తొలి డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న వీసీ మారెడ్డి అంజిరెడ్డి తదితరులు

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ తొలి డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని వర్శిటీ భవనంలో పాలక మండలి సభ్యులు, భవన నిర్మాణ కమిటీ సభ్యులు, యూనివర్శిటీ పరిధిలో గుర్తింపు పొందిన కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, యూనివర్శిటీ టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్‌తో కలిసి వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి డైరీని ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. జిల్లాలోని 93 డిగ్రీ, 110 బీఈడీ, 4 ఫార్మసీ, రెండు న్యాయ కళాశాలలకు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. పేర్నమిట్ట కొండ మీదకు అప్రోచ్ రోడ్డు వేసేందుకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ రూ.1.25 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఓఎస్‌డీ రాజు, అకడమిక్ డీన్ వెంకటేశ్వరరెడ్డి, జి.సోమశేఖర తదితరులు పాల్గొన్నారు.





## చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్న పారిశుద్ధ్య కార్మికులు


ట్రాక్టర్లను అడ్డుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులను నిలువరిస్తున్న పోలీసులు


రాత్రి వేళ పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

- కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఒంగోలు నగరంలో రాత్రి వేళా పారిశుధ్య పనులు

ఒంగోలు సబర్బన్: సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు ఆదివారం ఒంగోలు నగరంలో చెత్త సేకరిస్తున్న ట్రాక్టర్లు, యంత్రాలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పారిశుధ్య కార్మికులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం నగరంలో పారిశుధ్య పనులు యథావిధిగా కొనసాగాయి. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులతోపాటు అదనంగా మరికొందరిని కేటాయించి మరీ పనులు చేపట్టారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, మరో పది మంది అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. పోతురాజు కాలువలో పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించారు. మంగమూరు రోడ్డు, బలరాం కాలనీ, కబాడిపాలెం ప్రాంతాల్లో రాత్రి వేళ చేపడుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

## 'వాసవీ' సూపర్ బెస్ట్ జోన్ చైర్‌పర్సన్‌గా అరవిందలక్ష్మి

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ సంస్థ 2023కుగాను అవార్డులు ప్రకటించింది. విజయవాడలోని లబ్బీపేటలో ఆదివారం సంస్థ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అధ్యక్షతన అవార్డులు అందజేశారు. ఒంగోలు నగరానికి చెందిన వాసవి క్లబ్స్ జోన్ చైర్‌పర్సన్ మద్దు అరవింద లక్ష్మి సూపర్ బెస్ట్ అవార్డు అందుకున్నారు. ఆమెను వాసవీ క్లబ్ ప్రతినిధులు ఊటుకూరు ఉమాఅన్నపూర్ణ, గ్రంధి లక్ష్మీ నాగ రాజకుమారి, బైసాని వెంకట సుజాత, చీదెళ్ల వేంకట ప్రసాద్, నూకల శ్రీనివాసరావు, అమరా సత్యనారాయణ, చలువాది సత్యనారాయణ, రాధా రమణ గుప్తా జంధ్యం, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.